
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 7 జనవరి 2025



నేడు టెన్నికాయిట్ జిల్లా టీం ఎంపిక పోటీలు

విజయనగరం టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న ఏపీ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ పోటీల కోసం జిల్లా టీంను మంగళవారం ఎంపిక చేయనున్నారు. పూసపాటిరేగ మండలం కొప్పెర్ల సోషల్ వెల్ఫేర్ హైస్కూల్‌లో పోటీలు జరగనున్నట్టు నిర్వాహకులు సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 2006 ఏప్రిల్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని, హాజరయ్యేవారు ఆధార్‌కార్డు తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 94917 61126ను సంప్రదించాలని కోరారు.



వేణుగోపాలుని ఆలయం
పూల సోయగం

బొబ్బిలి పట్టణ ప్రజల ఇలవేల్పు శ్రీ రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసమహోత్సవాల్లో భాగంగా సోమవారం పూలంగి సేవ కన్నులపండువగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్తలు, రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు, ఎమ్మెల్యే బేబీనాయనల ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. పది టన్నుల పూలతో ఆలయం, స్వామివార్ల అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయంలో సింహాచలేశుని ప్రతిమను భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేయడం మరో ప్రత్యేకతగా నిలిచింది. ప్రముఖులతో పాటు వందలాదిగా భక్తులు తరలివచ్చారు. పూలంగి సేవలతో అలసిసొలసిన స్వామికి మంగళవారం పుష్పయాగం నిర్వహిస్తారు.

ఆలయ ప్రవేశం వద్ద వెంకన్న స్వామి ప్రతిమ

6లో

పూల అలంకరణలో ఆలయం, ముందు పూలపాన్పు



బీసీలకు రుణయోగం

● స్వయం ఉపాధి పథకాల అమలు దిశగా ప్రభుత్వం అడుగులు

● రేపటి నుంచి దరఖాస్తుల ప్రక్రియ

6లో



కూటమి ప్రభుత్వం వచ్చాక బీసీలకు మొదటిసారి రుణయోగం కలగనుంది. పెద్ద ఎత్తున ఉపాధి రుణాలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 8 నుంచి 16 వరకూ దరఖాస్తులు స్వీకరించనుంది. ఆ తర్వాత 17 నుంచి 19 వరకూ మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టనుంది. 20 నుంచి వచ్చే నెల 20 వరకూ ధ్రువపత్రాల పరిశీలనకు షెడ్యూల్ నిర్ణయించింది. విజయనగరం జిల్లాలో 2,883 మంది లబ్ధిదారులకు రూ.53.48 కోట్లు, పార్వతీపురం మన్యంలో 1221 మంది లబ్ధిదారులకు రూ.23.24 కోట్లు అందించాలనుకుంటోంది.

గ్రానైట్ కొండపై గద్దలు!

● గుట్టుగా సర్వే

● తమిళనాడు వాసులుగా గుర్తింపు

● బృందంలో విజయనగరం, శ్రీకాకుళం వ్యక్తులు


● గిరిజన, ఆదివాసీల్లో ఆందోళన


● రెవెన్యూ అధికారికి వినతిపత్రం

గ్రానైట్ నిక్షేపాలపై గద్దలు కన్నేశాయి. వేరే రాష్ట్రం నుంచి వచ్చి గుట్టుగా చూసి వెళ్లిపోయాయి. గతంలో కొంత కొల్లగొట్టినా.. ఇప్పుడు పూర్తిగా ఊడ్చేయడానికి ఉబలాటపడుతున్నాయి. నిక్షేపాలను అంచనా వేసేందుకు స్థానిక యంత్రాంగానికి కనీస సమాచారం ఇవ్వకుండానే ప్రైవేటు సైన్యాన్ని దించేశాయి. ఇది తెలిసి ఆందోళన చెందుతున్న ఆదివాసీ, ప్రజాసంఘాలు అధికార యంత్రాంగాన్ని ఆశ్రయించాయి. రెవెన్యూ అధికారులు మాత్రం తమకెలాంటి సమాచారం లేదని చెబుతున్నారు.



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నేతలు (ఫైల్)





కొండలింగాలవలస పంచాయతీ పరిధిలోని బోడిమెట్ట కొండ

మెంటాడ, జనవరి 6((ఆంధ్రజ్యోతి): మెంటాడ మండం కొండలింగాలవలస గ్రామ పంచాయతీ పరిధిలో బోడిమెట్ట కొండ ప్రాంతంలో అపార గ్రానైట్ ఖనిజ నిక్షేపాలున్నాయి. సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఇవి విస్తరించి ఉన్నట్లు ప్రాథమిక అంచనా. వేలకోట్ల రూపాయల విలువైన సంపద కావడంతో కొల్లగొట్టేందుకు సుమారు పదిహేనేళ్ల క్రితంనుంచీ ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది ఎన్నో విధాలుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇరవై ఏళ్ల క్రితం ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన కొందరు బడాబాబులు ఉద్దంగి గ్రామ సమీపాన కొండపై కొన్నాళ్లపాటు తవ్వకాలు జరిపి నిక్షేపాల్లో కొంతమేర తరలించగా, తర్వాత ఏ కారణంతోనే నిలిపివేశారు. అప్పటి తవ్వకాల ఆనవాళ్లు నేటికీ నిక్షేపంగా ఉన్నాయి. ఇదిలా ఉంటే పదిరోజుల క్రితం ఓ బృందం గుట్టుచప్పుడు కాకుండా సర్వే నిర్వహించినట్టు కొద్దిరోజుల అనంతరం స్థానిక ఆదివాసీలు, గిరిజన, ప్రజాసంఘాల ప్రతినిధులు అనుమానిస్తున్నారు. వారు సవరవిల్లి వరకూ పరిశీలించారని చెబుతున్నారు. ఆ బృందంలో తమిళనాడుకు చెందినవారితోపాటు విజయనగరం, శ్రీకాకుళానికి చెందిన వారున్నట్టు కూడా గుర్తించారు. కొండ ప్రాంతంలో పర్యటించి సర్వే చేసినట్టు నిర్ధారించుకుని ఆందోళన చెందుతున్నారు. ఈ కొండలు పాచిపెంట మండలం సరిహద్దు వరకూ ఉన్నాయి. కొండపై నిక్షేపాల తవ్వకాలకు అనుమతి ఇస్తే కొండను ఆనుకొని ఉన్న భూములకు (మిగతా 8వ పేజీలో..)

నీరు కదలనంటోంది

● అధ్వానంగా తోటపల్లి ప్రాజెక్ట్ కాలువలు

● ఎక్కడికక్కడ పేరుకుపోతున్న రెల్లు గడ్డి

● రెండు జిల్లాల రైతులకు కష్టాలు



6లో

కొనసాగుతున్న కానిస్టేబుల్ నియామక ప్రక్రియ

విజయనగరం క్రైం, జనవరి6(ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసు కానిస్టేబుల్స్ నియామకాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటీ, పీఈటీ ప్రక్రియ కొనసాగుతోంది. ఆరో రోజు సోమవారం 550 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి వుండగా, 346 మంది మాత్రమే వచ్చారు. ఎస్పీ వకుల్‌జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత, నియామకాల ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు.ముందుగా హాల్ టిక్కెట్లు పరిశీలించి లోపలికి అనుమతించారు. నియామక ప్రక్రియలో ఏఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, వీరకుమార్, బాపూజీ, శ్రీనివాసరావు, థామస్‌రెడ్డి, ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నియామక ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్



ఒక్కోటి లక్ష!

● పందెం కోళ్లకు విపరీతమైన డిమాండ్

● భోగాపురం ప్రాంతంలో అమ్మకాలు



అమ్మకానికి పందెం కోళ్లు

భోగాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వచ్చిందంటే పందెంకోళ్లు గుర్తుకొస్తాయి. జిల్లాలో అక్కడక్కడే కోడి పందేలు ఆడుతున్నప్పటికీ వాటి పెంపకం.. విక్ర యాలు జోరుగా జరుగుతాయి. వేల నుంచి లక్ష రూపాయల వరకు కోళ్ల ధర పలుకు తోంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు భోగాపురం చుట్టుపక్కల ప్రాంతాలకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తారు. ఈ ఏడాది కూడా పందెం కోళ్ల విక్రయాలు జోరందుకున్నాయి. సంక్రాంతి సమీపించడంతో దాదాపు చివరి దశకు చేరాయి.

తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కడున్నా, ఇతర దేశాల్లో ఉన్నా సంక్రాంతి పండుక్కి తప్పకుండా స్వగ్రామాలకు వచ్చి తీరుతారు. అంతే కాదు పండుగ పేరుతో నిర్వహించే కోడిపందేలు తిలకించేందుకు ఆసక్తి చూపుతారు. అందుకే సంక్రాంతి రోజుల్లో పందెం కోళ్లకు ఎక్కడా లేని గిరాకీ ఉంటుంది. పందేలపై నిషేధం ఉన్నా కూడా చాలా ప్రాంతాల్లో కోడి పందేలను గుట్టుగా నిర్వహిస్తుంటారు. ఇతర ప్రాంతాల్లో కూడా డిమాండ్ ఉండడంతో ఏటా భోగాపురం చుట్టు పక్కల గ్రామాల్లో పందెం కోళ్ల పెంపకాన్ని చేపడుతున్నారు. అధిక మదుపుపెట్టి పుష్టిగా తయారు చేస్తున్నారు. ధర కూడా అధికంగానే ఉంటోంది. దాదాపు రూ.లక్ష పలికిన కోళ్లు కూడా ఉన్నాయి. పందెం కోళ్ల పెంపకానికి సంబంధించి గుడ్లు పొదిగించి వాటిలో సరైన కోడి పిల్లలను ఎంపిక చేసి పందెంకు తయారు చేయడానికి సుమారు రెండేళ్ల సమయం పడుతుంది. వీటికి ప్రతిరోజూ రాగులు, గంటెలు, ధాన్యం, బాదం పప్పు, జీడి పప్పు, పిస్తా, మాంసం కైమా ఆహారంగా పెడతారు. అలాగే పరుగెత్తించడం, ఈత కొట్టించడం నేర్పిస్తారు. ప్రతిరోజూ కఫం తీస్తారు. వీటి రెట్టను పరిశీలిస్తూ మందులు కూడా వేస్తారు. ఈవిధంగా రెండు సంవత్సరాల పాటు పందెం కోడిని పెంచుతారు. ఇక్కడ పచ్చకాకి, నెమలి, కోడిరసంగి, కోడిఅబ్రాస్, చేతువ, ఎర్రడేగ రకాలకు చెందిన పందెంకోళ్లు ఉన్నాయి. భీమవరం, ఒడిశా, విశాఖపట్నం, రణస్థలం, నరవ, ఆరిలోవ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి ఇక్కడ పందెం కోళ్లను కొనుగోలు చేస్తున్నారు. భోగాపురం ప్రాంతం నుంచి ఇప్పటికే చాలా పందెం కోళ్లను కొనుగోలు చేసి తీసుకెళ్లిపోయారు.



రూ.వెయ్యి కోసం..

● స్నేహితుడిని చంపేసిన యువకుడు

● కూలి పంపకంలో తేడాలే గొడవకు కారణం

పూసపాటిరేగ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ స్నేహితులు. రోజూ కలిసే పెయింటింగ్ పనులకు వెళ్తుండేవారు. కొన్నేళ్లుగా పనిచేసుకుంటున్నారు. చాలా కలివిడిగా ఉండేవారు. ఎప్పటిలాగే కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తూ డబ్బులు వాటాలు వేసుకున్నారు. వెయ్యి రూపాయలు తేడా రావడంతో ఇద్దరి మధ్య చిన్న గొడవ తలెత్తింది. అదే చివరకు ఉద్రేకానికి దారితీసింది. స్నేహితుడన్న విషయం మరిచిపోయి క్షణికావేశానికి లోనై తన వద్దనున్న ఆయుధంతో స్నేహితుడి చాతీపై పొడిచేశాడు. కేకలు విన్న తల్లి వచ్చి సపర్యలు చేస్తుండగానే ఆ యువకుడు కన్నుమూశాడు. ఎరుకొండ గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఎరుకొండ గ్రామానికి చెందిన గొర్లె పవన్(21), బొంతు అప్పలనాయుడు పెయింట్ పనులకు వెళ్తుంటారు. చాలాకాలం నుంచి ఇదే పని చేస్తున్నారు. సమీపంలో ఉన్న మరో గ్రామానికి ఆదివారం పనులకు వెళ్లి పూర్తయ్యాక ఇద్దరూ కలిసి ఇంటికి బయలుదేరారు. కూలి డబ్బుల విషయమై కొత్తకొప్పెర్ల వైన్‌షాపు వద్ద మాట్లాడుకున్నారు. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ లెక్క రావడంతో వాదులాడుకున్నారు. అనంతరం స్వగ్రామం ఎరుకొండకు బయలుదేరారు. పవన్ ఇంటి వద్ద ఆగి మళ్లీ డబ్బుల విష యమై గొడవ పడ్డారు. ఈ క్రమంలో అప్పలనాయుడు తనవ ద్ద ఉన్న ఆయుధంతో పవన్ చాతీలో పొడిచేశాడు. మూడు చో ట్ల పొడవడంతో తీవ్రంగా రక్తస్రావం అయింది. పవన్ కేకలు విన్న తల్లి బంగారమ్మ పరుగున వచ్చి ఒడిలోకి తీసుకుంది. ఏం కాదని ఓదార్చు తుండగానే పవన్ ప్రాణం విడిచాడు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఈ ఘటన జరి గింది. స్థానికులు అక్కడికి వచ్చేసరికి నిందితుడు పారిపో యాడు. రక్తపు మడుగులో తనయుడ్ని చూసి ఆ తల్లి తల్లడి ల్లిపోయింది.

వెయ్యి రూపాయల కోసం ఘర్షణ పడి ప్రాణం తీయడాన్ని స్థానికులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. కూలి డబ్బుల పంపకంలో వచ్చిన వ్యత్యాసమే హత్యకు కారణంగా పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని చెబుతున్నారు. సీఐ రామకృష్ణ, ఎస్ఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. ఫోరెనిక్స్ నిపుణుల బృందం, డాగ్ స్క్వాడ్ కూడా పరిశీలించాయి. మృ తుడి ఇంటి ముందే నడిరోడ్డుపై హత్య జరగడంతో గ్రామంలో కలకలం రేగింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీం



గొర్లె పవన్ (ఫైల్)

15,66,438 మంది ఓటర్లు

● తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల కమిషన్ ● జిల్లాలో పెరిగిన 1904 ఓట్లు

విజయనగరం కలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితా సోమవారం విడుదల చేసింది. ఆ ప్రకారం జిల్లాలో ఓటర్ల సంఖ్య 15,66,438కు చేరుకుంది. పురుషులు 7,72,393 మంది ఉండగా, మహిళలు 7,93,974 మంది, థర్డ్ జండర్ 71 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 21,581 మంది అధికంగా ఉన్నారు. గత ఏడాది అక్టోబరు 29న విడుదల చేసిన డ్రాఫ్ట్ రోల్ ప్రకారం 1847 పోలింగ్ కేంద్రాల్లో 15,64,530 ఓటర్ల ఉండగా ఇప్పుడు విడుదల చేసిన జాబితాలో 15,66,438కి చేరుకున్నారు. కొత్తగా 1904 మంది ఓటర్లు పెరిగారు. విజయనగరం నియోజకవర్గంలో అత్యధికంగా 2,58,310 ఉండగా, అత్యలంగా చీపురుపల్లి నియోకవర్గంలో 2,05,761 ఉన్నారు. జిల్లాలో రాజాం తప్పా అన్ని నియోజకవర్గాల్లోనూ పురుషులు కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. రాజాం నియోజకవర్గంలో మహిళలు 1,13,228 ఉండగా, పురుషులు 1,14,773 ఉన్నారు. మహిళలు కంటే పురుషులు 1545 మంది ఎక్కువగా ఉన్నారు. విడుదల చేసిన జాబితాను రెవెన్యూ సిబ్బంది కలెక్టరేట్ నుంచి మండలాలకు తీసుకువెళ్లారు.




నియోజకవర్గాల వారీ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం ఓటర్లు
రాజాం	1,11,773	1,113,228	16	2,28,017
బొబ్బిలి	1,14,493	1,17,320	9	2,31,822
చీపురుపల్లి	1,02,753	1,02,999	9	2,05,761
గజపతినగరం	1,00,943	1,04,838	4	2,05,785
నెల్లిమర్ల	1,05,806	108188	3	2,13,997
విజయనగరం	1,25,325	1,32,957	28	2,58,310
ఎస్.కోట	1,08300	1,14,444	2	2,22,746
మొత్తం	7,72,393	7,93,974	71	15,66,438

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్

● రెండు గంటల పాటు స్థానికులకు ఇబ్బంది



7లో



400 మీటర్ల పరుగు పందెంలో విభిన్న ప్రతిభావంతులు



షార్ట్‌పుట్ విసురుతున్న విద్యార్థిని

ప్రతిభలో తీసిపోమని..!

- క్రీడల్లో రాణించిన విభిన్న ప్రతిభావంతులు
- ఆసక్తికరంగా పారా అథ్లెటిక్స్

విజయనగరం టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): లాంగ్ జంప్.. రన్నింగ్.. షార్ట్‌పుట్.. ప్రతి క్రీడలోనూ ప్రతిభ చూపించారు. చూపరులను ఆశ్చర్యచకితులను చేశారు. తాము ఎవరికీ తీసిపోమని నిరూపించారు. ఇదీ విభిన్న.. 'ప్రతిభావంతుల' విజయం. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సహకారంతో విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి పారా అథ్లెటిక్ పోటీలు సోమవారం రాజీవ్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా అసోసియేషన్ కార్యదర్శి వి.రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రన్నింగ్, జావెలిన్, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ క్రీడలకు వివిధ విభాగాల వారీగా పోటీలు నిర్వహించామని తెలిపారు. జిల్లా నుంచి 70 మంది పారా క్రీడాకారులు హాజరయ్యారని వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 33 మందిని ఈ నెల 30న గుంటూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్టు వెల్లడించారు.





లాంగ్ జంప్ చేస్తూ...



లాంగ్ జంప్‌లో..



రావివలసలో రచ్చబండపై విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

రచ్చబండ చదువులు

గరుగుబిల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రావివలసలోని ప్రాథమిక పాఠశాలకు వసతి సమస్య వేధిస్తోంది. దీంతో విద్యార్థులు రచ్చబండపై పాఠాలు నేర్చుకోవలసి వస్తోంది. ఈ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సరైన భవనాలు లేక సోమవారం రచ్చబండపై బోధించాల్సి వచ్చింది. ఒకవైపు చలితో ఇబ్బంది పడుతూనే విద్యార్థులు చదువుకోవలసి వచ్చింది. సంబంధిత అధికారులు దృష్టి సారించి పూర్తి స్థాయిలో బోధనకు అవసరమైన నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. సీమలవానివలస, కారివలస గ్రామాల్లో భవనాలు శిథిలం కావడంతో వరండాల్లో, పశువుల శాలల్లో బోధిస్తున్నారు. అధికారులు ఈ పాఠశాలల్లోనూ వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా బాలా త్రిపురసుందరి నవరాత్రి ఉత్సవాలు

సాలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపంచముఖేశ్వర స్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న దృశ్యం



స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

వేణుగోపాలునికి వైభవంగా పూలంగి సేవ

- నేడు పుష్పయాగం

బొబ్బిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ ప్రజల ఇలవేల్పు.. రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా సోమవారం పూలంగి సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు, రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్, మాజీ మంత్రి ఆర్‌వీ సుజయ్‌కృష్ణ రంగారావు, ఎమ్మెల్యే బేబీనాయనల ఆధ్వర్యంలో పూలంగి సేవ చేశారు. ఆలయ ప్రవేశ మార్గం నుంచి లోపల మూలవిరాట్‌లు, ఉపాలయాలలో పూల సోయగాలు ఆకట్టుకున్నాయి. బెంగళూరు, కడియం, కోల్‌కత్తా, చెన్నై, ఊటీ తదితర ప్రాంతాల నుంచి సుమారు 60 రకాల పూలను తెప్పించారు. పది టన్నుల పూలతో ఆలయ పరిసరాలను, విగ్రహాలను అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు వీరరాఘవాచార్యులు, అర్చకులు సత్యనారాయణ ఆచార్యులు, చామర్తి నరసింహాచార్యులు, భద్రం కూర్మాచార్యులు, జగదీశ్ కుమార్‌ల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ ఏడాది ఆలయంలో భక్తుల కోసం సింహాచలేశుని ప్రతిరూపాన్ని, కప్పస్తంభాన్ని ఏర్పాటు చేశారు. గర్భగుడి ప్రాంతంలో వివిధ రకాల పండ్లు, పూలతో అలంకరించారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన భజన కళాకారులు ఉదయమంతా ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. ఇదిలా ఉండగా... మంగళవారం ఒకటిన్నర టన్నుల పూలతో పుష్పయాగం నిర్వహిస్తామని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. శాస్త్రోక్తంగా 108 బుట్టల (ఒకటిన్నర టన్నుల) పూలను కోట నుంచి తెచ్చి పుష్పయాగం నిర్వహిస్తామని చెప్పారు.



సింహాచలేశుని రూపంలో...

నీరు కదలనంటోంది

- అధ్వానంగా తోటపల్లి ప్రాజెక్ట్ కాలువలు
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న రెల్లు గడ్డి
- రెండు జిల్లాల రైతులకు కష్టాలు

రాజాం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు కాలువలు అధ్వానంగా మారాయి. కిలోమీటర్ల మేర వ్యర్థాలు, పిచ్చిమొక్కలు పేరుకు పోయాయి. గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో ఈ పరిస్థితి నెలకొంది. శివారు ప్రాంతాలకు సాగునీటి సరఫరాలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఫలితంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం తదితర మండలాల రైతులకు సాగునీటి అవస్థలు తప్పడం లేదు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అధికారికంగా 1.20 లక్షల ఎకరాలకు, అనధికారికంగా సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో తోటపల్లి ప్రాజెక్టును నిర్మించారు. దీని రెండు కాలువల ద్వారా రాజాం నియోజకవర్గంతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం తదితర మండలాలకు సాగునీరు సరఫరా అవుతోంది. వీటిలో తెర్లాం మండలం నుంచి అరసబలగ, రాజాం మండలం కంచరాం, గడిముడిదాం, రేగిడి మండలంలోని వ్యవసాయ భూములకు సాగునీరందించే కాలువలో 52.450 కిలోమీటర్ల నుంచి 117.890 కిలోమీటర్ల వరకూ ఇదే దుస్థితి కనిపిస్తోంది. రెండో మార్గంలో తెర్లాం, రాజాం మండలం ఎం.జె.వలస, బి.ఎస్.వలస, గెడ్డవలస, బొద్దాం, సోపేరు మీదుగా శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, రణస్థలం, లావేరు తదితర మండలాల రైతాంగానికి సాగునీరందించే కాలువలదీ ఇదే దుస్థితి. వ్యర్థాలు పేరుకుపోయాయి. పిచ్చిమొక్కలు, రెల్లుగడ్డి పెరిగిపోయింది. ఫలితంగా సాగునీటి సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోంది.



తోటపల్లి ప్రాజెక్టు కాలువ

అప్పట్లో నిర్లక్ష్యం...

గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలతో పాటు అత్యంత ప్రాధాన్యం కలిగిన సాగునీటి రంగాన్నీ నిర్వీర్యం చేసింది. కాలువల మరమ్మతులు, ఆధునికీకరణ, లైనింగ్ పనుల కోసం ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. దీంతో రైతాంగానికి అయిదేళ్లూ అవస్థలు తప్పలేదు. వర్షాధారంపై ఆధారపడే రైతులు చెరువులు, నేలబావుల్లోని నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడుతూ సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే తోటపల్లి కాలువలను ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు వ్యర్థాలను కాలువల్లో పడేస్తున్నారు. దీంతో సాగునీటి ప్రవాహ వేగం మందగించి... సకాలంలో శివారుకు చేరడంలేదు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదని.. ప్రస్తుతం కాలువల పరిస్థితిపై నివేదిక తయారుచేసి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తోటపల్లి ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా సమీప పంచాయతీల ప్రజాప్రతినిధులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.



రేగిడి మండలానికి సాగునీరందించే కాలువ ఇలా..



బొద్దాం వద్ద కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



బీసీలకు రుణాల పండుగ

- స్వయం ఉపాధి పథకాలకు వర్తింపు
- రేపటి నుంచి దరఖాస్తు ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాకు 4,104 యూనిట్లు

విజయనగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీలకు శుభవార్త చెప్పింది. పెద్ద ఎత్తున ఉపాధి రుణాలు అందించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 8 నుంచి 16 వరకూ రుణాలకు దరఖాస్తులను స్వీకరించనుంది. 17 నుంచి 19 వరకూ మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టనుంది. 20 నుంచి వచ్చే నెల 20 వరకూ పత్రాల పరిశీలన ఉంటుంది. బ్యాంకుల వారీగా అర్హులు, అనర్హుల జాబితాను విడుదల చేయడమే కాకుండా... సచివాలయాల్లోనూ ప్రదర్శిస్తారు. ఫిబ్రవరి 21 నుంచి 28 వరకూ వారం రోజుల పాటు యూనిట్ల మంజూరు ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 4,104 యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. బీసీ లలోని ఎ, బి, సి, డి, వర్గాలకు యూనిట్లు మంజూరు చేయనున్నారు. విజయనగరం జిల్లాలో 2,883 మంది లబ్ధిదారులకు రూ.53.48 కోట్లు, పార్వతీపురం మన్యంలో 1,221 మంది లబ్ధిదారులకుగాను రూ.23.24 కోట్లు అందించేందుకు నిర్ణయించారు.

ఈ యూనిట్లకు అవకాశం

బీసీలకు ఇచ్చే రుణాలతో ప్రధానంగా కుట్టు శిక్షణ, కోళ్లఫారాలు, పాడి, వస్త్ర దుకాణాలు, ఫొటో స్టూడియోలు, జిరాక్స్ షాపులు, ఇంటర్ నెట్ కేంద్రాలు, బ్యూటీపార్లర్లు తదితర యూనిట్ల స్థాపనకు అవకాశం ఉంటుంది. యూనిట్‌కు సంబంధించి 50 శాతం బ్యాంకు రుణంగా అందిస్తారు. మిగతా 50 శాతం రాయితీ. బ్యాంకు నుంచి కూడా ప్రభుత్వమే రుణం ఇప్పిస్తుంది. ఇందులో రూపాయి కూడా లబ్ధిదారుడు కట్టనవసరం లేదు. 100 శాతం యూనిట్ ఏర్పాటు చేస్తేనే మంజూరు చేస్తారు. లేకుంటే మాత్రం అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. 21 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (ఏపీవోబీఎంఎంఎస్)లో నమోదు చేసుకోవాలి.

వైసీపీ హయాంలో వదిలేసి..

వైసీపీ హయాంలో గత ఐదేళ్లలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. పేరుకే కార్పొరేషన్లు కానీ.. నవరత్నాల్లో పథకాలను కార్పొరేషన్ల కేటాయింపులుగా చూపి చేతులు దులుపుకున్నారు. కుల కార్పొరేషన్లు రాజకీయ నాయకుల ఉపాధికి వేదికగా మారాయే తప్ప.. ఆ సామాజిక వర్గాల్లో యువతకు ఎటువంటి న్యాయం జరుగలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా వీటిపై దృష్టి పెట్టింది. బీసీ కార్పొరేషన్ అయితే పూర్తిగా నిర్వీర్యమైంది. 2014 నుంచి 2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో 50,852 మందికి రూ.220.98 కోట్లు రుణాలు, రాయితీల రూపంలో అందించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ గత ఐదేళ్ల వైసీపీ హయాంలో బీసీలకు ఎటువంటి ప్రయోజనం కల్పించలేదు.









100 శాతం యూనిట్లు పెడితేనే..

స్వయం ఉపాధికి సంబంధించి ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుంది. 100 శాతం యూనిట్లు పెడితేనే రుణంతో పాటు రాయితీ అందుతుంది. ఈ అవకాశాన్ని బీసీలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం 50 శాతం రాయితీ అందించడమే కాకుండా.. 50 శాతం బ్యాంకు రుణాలు కూడా అందిస్తుంది.

-పెంటోజీరావు, బీసీ సంక్షేమ శాఖ సాధికారిత అధికారి, విజయనగరం

ప్రధాని మోదీ సభను విజయవంతం చేద్దాం



శృంగవరపుకోట రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



రాజాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

శృంగవరపుకోట రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల 8న నిర్వహించనున్న ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గం నుంచి పదివేల మంది హాజరయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతిష్ఠాత్మక సభ విజయవంతం కావాడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు చెక్కా కిరణ్, వాసు, చెల్లయ్య, రాజు ఉన్నారు.

●రాజాం: విశాఖలో 8న నిర్వహించనున్న ప్రధాని మోదీ భారీ బహిరంగసభను అందరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. సోమవారం శ్యాంపురంలోని క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి సన్నద్ధత సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ మోడీ సభకు రాజాం నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో విశాఖకు తరలి వెళ్లేలా నాయకులు అందరినీ సమాయత్తం చేయాలన్నారు. రాజాం నియోజకవర్గం నుంచి 67 బస్సుల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెళ్లేందుకు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొత్స వాసుదేవరావునాయుడు, నంది సూర్యప్రకాశరావు, సుమల మన్మథరావు. పిన్నింటి మోహనరావు. కిమిడి అశోక్‌కుమార్. గురవాన నారాయణరావు పాల్గొన్నారు.

●విజయనగరం రూరల్: ప్రధాని మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.



విజయనగరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

శాకంబరిగా గోదాదేవి



శాకంబరిగా గోదాదేవి అలంకరణ

విజయనగరం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేటలో కొలువైన మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస విశేష పూజలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రోజూ స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. సోమవారం గోదాదేవిని శాకంబరిగా అలంకరించినట్టు ఆలయ ప్రధాన పూజారి ఫణిహారం మణిబాబు తెలిపారు. మంగళవారం రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామికి పూలంగి సేవ నిర్వహించనున్నట్టు తెలిపారు.

రాష్ట్ర కబడ్డీ జట్టులో జిల్లా క్రీడాకారులు

విజయనగరం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ జట్టులో ఐదుగురు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 12 వరకూ ఉత్తరాఖండ్‌లో జరగబోయే 50 జాతీయ జూనియర్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు వారు హాజరుకానున్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవీపీ రాజు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. రాంబాబు, మురళీ, పి.నందిని, వి.సూర్యకళ, ఎం.పావనీలను అసోసియేషన్ కార్యదర్శి ప్రభావతి, అధ్యక్షుడు రంగారావు దొర, కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణరావు, కోశాధికారి శివ అభినందించారు.

ఉత్తరకుమార్ మృతికి నివాళి

రాజాం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొండంపేటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు గుడివాడ ఉత్తర్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కొండంపేట గ్రామానికి వెళ్లి సోమవారం ఆయనకు నివాళులర్పించారు. టీడీపీ ఓ మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన

విజయనగరం దాసన్నపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఆర్‌కె టౌన్‌షిప్‌లో జీఎంఆర్ వరలక్ష్మీ ఉపాధి శిక్షణ సంస్థ ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ కార్యదర్శి సత్యం, డాక్టరు వేణుగోపాలరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో జీఎంఆర్ ప్రతినిధి కనకం వెంకటరమణ, జీఎంఆర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

రేగిడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు విశేష కృషి చేస్తున్నారని పనసలవలస టీడీపీ నేత కడగల నాగరాజు అన్నారు. మండలంలో పనసలవలసలో కోండ్రు చొరవతో ఉపాధి నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆయనతో పాటు టీడీపీ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో కడగల బోడినాయుడు, అప్పలనాయుడు, కృష్ణ, పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

గరివిడి శర్మకు 'జ్యోతిషరత్న'



శర్మను సత్కరిస్తున్న దృశ్యం

గరివిడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని వరసిద్ధి వినాయక దేవాలయం అర్చకుడు, ప్రముఖ పండితుడు బ్రహ్మశ్రీ మామిడి సురేష్‌శర్మకు జ్యోతిషరత్న బిరుదు వరించింది. విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞానసంస్థ ఆధ్వర్యంలో విశాఖలో జ్యోతిష పండితుల సమావేశం జరిగింది. సమావేశంలో శృంగేరి, కంచి పీఠాలకు చెందిన జ్యోతిష పండితులు జ్యోతిషం దాని అవసరం, సూర్య సిద్ధాంతం, ధృక్ సిద్ధాంతం, ఖగోళ గణితంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా సురేష్‌శర్మను జ్యోతిషరత్న బిరుదుతో సత్కరించారు.

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

విజయనగరం రింగురోడ్డు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 2025-26 ఆర్థిక సంవత్సరానికి డిస్కమ్‌లు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై వ్యక్తిగతంగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రేపటి నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడలోని బృందావన్ కాలనీలో ఎ-కన్వెన్షన్ సెంటర్ నుంచి, 10న నియంత్రణ మండలి సమావేశ మందిరం కర్నూల్ నుంచి నిర్వహించనున్నామని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వ్యక్తిగతంగా.. 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయాలను సేకరిస్తామన్నారు. ప్రజలు తమ అభ్యంతరాలు, సూచనలను తెలియజేయవచ్చునన్నారు.

163 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 163 వినతులు అందాయి. కలెక్టరు అంబేడ్కర్ డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, మురళీ తదితరులు వినతులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూకు సంబంధించి 123 వినతులు, మున్సిపల్ శాఖకు 5, డీఆర్‌డీఏకు 18, మున్సిపల్ శాఖకు 5, డీపీవోకు 5 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టరు ఆయా శాఖ అధికారులతో సమీక్షించారు. రీ-ఓపెన్ కేసులు లేకుండా చూడాలన్నారు.

సానుకూలంగా స్పందించండి



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో బాధితుల సమస్యలపై సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 17 ఫిర్యాదులు ఆయన స్వీకరించారు. ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించి 2, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్టు 4, ఇతర అంశాలకు సంబంధించి 7 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు శంకరరావు, లీలారావు, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న ధనలక్ష్మి

● జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కెప్టెన్‌గా ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని

గుర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గరికివలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని మండల ధనలక్ష్మి ఖోఖో క్రీడలో రాణిస్తోంది. నవంబరులో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజయనగరం జిల్లా జట్టుకు కెప్టెన్‌గా ధనలక్ష్మి వ్యవహరించి జట్టు విజయానికి తోడ్పడింది. దాంతో ఈ నెల 10 నుంచి 13 వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ధనలక్ష్మి ఎంపికైందని పీడీ మల్లికార్జునరావు తెలిపారు. ఖోఖో జట్టు కెప్టెన్‌గానూ వ్యవహరించనుందని తెలిపారు. ధనలక్ష్మి మారుమూల పల్లె నుంచి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో ధనలక్ష్మి పాల్గొని సత్తా చాటుతుండటంతో ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ అప్పారావు, గ్రామ పెద్దలు ధనలక్ష్మిని అభినందించారు.

బాల్య వివాహాలను నివారిద్దాం

గుర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నివారించడానికి కంకణం కట్టుకోవాలని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కిశోర్ బాలికల ఫేజ్-2 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో 42 పంచాయతీల కార్యదర్శులు ఐసీడీఎస్ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కిషోర్ బాలికలకు వివాహాలు చేస్తున్నారన్నారు. అలాంటి కార్యక్రమాలను అడ్డుకోవాలని సూచించారు. బాలికలకు విద్య అవసరం తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శకుంతల, రాధిక తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ప్రాంగణ ఎంపికలు



ప్రాంగణ ఎంపికలకు హాజరైన విద్యార్థులు

గరివిడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవంతీస్ సెయింట్ థెరీసా ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జామవా మాట్లాడుతూ అవంతి కాలేజీతో పాటు ఇతర కాలేజీలకు చెందిన 251 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. ఇందులో 21మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏవో జి.అనీల్‌కుమార్, కాలేజీ ప్లేస్‌మెంట్ అధికారి అభిలాష్ పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు జరిగాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్

● రెండు గంటల పాటు స్థానికులకు ఇబ్బంది



పట్టాలు దాటుతున్న విద్యార్థులు

శృంగవరపుకోట రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట-పుణ్యగిరి రోడ్డులో సోమవారం ఉదయం ఏడున్నర సమయంలో విశాఖ నుంచి కిరండోల్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు పట్టాలపై సాంకేతిక లోపంతో నిలిచింది. దీంతో రెండు గంటల పాటు స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఇందుకు సంబంధించి రైల్వే సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ నుంచి కిరండోల్ వైపు వెళ్తున్న నాల్కో పౌడర్ గూడ్స్ రైలు ఎస్.కోట రైల్వేస్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి ఇంజన్ వెనుక భాగంలో ఉన్న రెండు బోగీల చక్రాల కదలికలో తేడా ఉన్నట్టు గుర్తించిన లోకో పైలెట్ వెంటనే స్టేషన్ సమీపంలో రైలును ఆపేశాడు. వెనుక బోగీల చక్రాలు పట్టి వేయడాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో సిబ్బంది అక్కడకు చేరుకుని ఇంజన్ వెనుక భాగంలో రెండు బోగీలను రైలు నుంచి వేరుచేశారు. ఇందుకుగానూ సుమారు రెండు గంటల సమయం పట్టింది. దాంతో పుణ్యగిరి నుంచి ఎస్.కోట పట్టణంలోకి వెళ్లేవారు, జగనన్న కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. దీంతో పాటు ట్రైన్ మెయిన్ ట్రాక్‌పై గూడ్స్ నిలిచిపోవడంతో కిరండోల్ వెళ్లే పాసింజర్‌ను లక్కవరపుకోట వద్ద ఆపేశారు. అంతేకాకుండా బోగీల్లోని నాల్కో పౌడర్‌ను తస్కరించేందుకు కొందరు యత్నించడంతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది అడ్డుకున్నారు.

జీఎంఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ



సాయిసుచిత్ర



శ్రావణి



ధాత్రి



హర్షిత

రాజాం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై జీపీఆర్ యూనివర్సిటీలో నిర్వహించనున్న అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు స్థానిక జీఎంఆర్ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. పి.శ్రావణి, జె.హర్షిత, వి.ధాత్రి, వి.సాయిసుచిత్ర జేఎన్‌టీయూ విజయనగరం టీమ్ తరఫున పోటీలకు ఎంపికయ్యారని పీడీ అరుణ్‌కుమార్ తెలిపారు. టీమ్ కోచ్‌గా అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ స్వాతి వ్యవహరిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ఎంపికపై కళాశాల ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ జె.గిరిష్, డీన్ రాంబాబు తదితరులు అభినందించారు

మార్పు బాలకృష్ణమ్మకు నివాళి

విజయనగరం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ వర్థంతిని సోమవారం నిర్వహించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు.. బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పైడిరాజు, ఆర్.కృష్ణ, శ్రీదేవి, మూర్తి, అప్పలరాజు పాల్గొన్నారు.

ముగిసిన బాలికల క్రీడా పోటీలు

● అన్నవరం బాలికలకు ఓవరాల్ చాంపియన్‌షిప్



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కన్వీనర్

నెల్లిమర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ గురుకుల పాఠశాలల జోన్-1 క్రీడా పోటీలు నెల్లిమర్లలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 14 పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అన్నవరం గురుకుల పాఠశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. విజేతలకు బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ డాక్టర్ కె.బి.బి.రావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను కె.భారతి సొంతం చేసుకుంది. కబడ్డీలో టెక్కలి, సాలూరు జట్లు ప్రథమ ద్వితీయ బహుమతులు సాధించాయి. అలాగే ఖోఖోలో పలాస, ఆమదాలవలస, బాడ్మింటన్‌లో తానాం, పార్వతీపురం హ్యాండ్ బాల్‌లో తానాం, నెల్లిమర్ల జట్లు, టెన్నికాయిట్‌లో పలాస, గంట్యాడ, చెస్‌లో పార్వతీపురం, అన్నవరం, క్యారమ్స్‌లో పాతపట్నం, శ్రీకాకుళం జట్లు బహుమతులు సాధించాయి. ఈ పోటీలకు అంపైర్‌లుగా కామేశ్వరి, సూర్యారావు, మోహన్, ఆనంద్, సీత, దమయంతి వ్యవహరించారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

శృంగవరపుకోట రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. సంఘటనకు సంబంధించి సీఐ నారాయణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మామిడిపల్లి గ్రామానికి చెందిన పి.హరితకుమారి తన భర్త చంద్రమౌళితో కలిసి బైక్‌పై ఎస్.కోట వస్తున్నారు. జామి మండలం భీమసింగికి చెందిన వ్యక్తి స్కూటీపై వేగంగా వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో హరితకుమారికి తీవ్ర గాయాలయ్యారు. ఆసుపత్రి తీసుకెళ్లే సరికే ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై సీఐ కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

సంతబొమ్మాళి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దండుగోపాలపురంలో అద్దె ఇంట్లో ఉంటున్న వావిలాపల్లి సురేష్ (25) సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి గ్రామానికి చెందిన సురేష్ మూలపేట పోర్టులో శ్రీ బాలాజీ మెస్ పవర్ సప్లైలో భోజనాలు అందించే వర్కర్‌గా కొద్దికాలంగా పనిచేస్తున్నాడు. మరో ఇద్దరితో కలిసి సురేష్ దండుగోపాలపురంలో ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. సోమవారం ముగ్గురు డ్యూటీకి వెళ్లగా సాయంత్రం సురేష్ రూంకి వచ్చి ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

దాడి కేసులో నలుగురి అరెస్టు

పాలకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గారమ్మ కాలనీలో నివసిస్తున్న పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్.సురేంద్రకుమార్‌పై గత ఏడాది నవంబరులో దాడి చేసిన నలుగురిని స్థానిక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈమేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితులను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా డీఎస్పీ రాంబాబు, ఎస్ఐ ప్రయోగమూర్తి కేసు వివరాలను వెల్లడించారు. పాలకొండ మండలం నవగాం గ్రామంలో అసిస్టెంట్ బ్రాంచి పోస్టుమాస్టరుగా పనిచేస్తున్న కందివలస దుర్గాప్రసాద్.. అసిస్టెంట్ సూపరింటెండెంట్ సురేంద్రకుమార్ తనకు సెలవులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని మనసులో కక్ష పెంచుకున్నాడు. విజయనగరానికి చెందిన దుర్గాప్రసాద్ అక్కడ తన స్నేహితులకు ఈ విషయాన్ని తెలియజేసి, దాడి చేయాలని పురమాయించాడు. షేక్ షాజహాన్ అనే వ్యక్తికి సురేంద్రకుమార్‌ను చూపించాడు. దీంతో షాజహాన్ వారం రోజులు రెక్కీ నిర్వహించాడు. ఇంట్లో సురేంద్రకుమార్ ఒక్కరే ఉంటున్నారని గుర్తించాడు. దసరా నవరాత్రుల్లో నవంబరు 8వ తేదీన షేక్ షాజహాన్.. ప్రకాష్, పి.రాజులతో కలిసి సురేంద్రకుమార్ ఇంట్లోకి చొరబడి, ఆయనపై దాడి చేశారు. తలుపులకు బయట నుంచి గొళ్లెం పెట్టి దూరంగా ఉంచిన తమ వాహనాలపై అక్కడ నుంచి విజయనగరం చేరుకున్నారు. సురేంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్, సెల్‌ఫోన్ సిగ్నల్ ద్వారా వివరాలు సేకరించారు. నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసును కొలిక్కి తీసుకొచ్చిన పాలకొండ సీఐ చంద్రమౌళి, ఇతర పోలీసులను డీఎస్పీ అభినందించారు.

లోట్లపల్లి రేషన్ డీలర్‌పై 6-ఏ కేసు

జామి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోట్లపల్లి రేషన్ డీలర్‌పై 6-ఎ కేసు నమోదు చేసినట్టు పౌర సరఫరాల తహశీల్దార్ ఎన్.వి.వి.ఎస్.మూర్తి తెలిపారు. సోమవారం డిపో తనిఖీ చేయడంతో బియ్యం, పప్పు నిల్వల్లో తేడా ఉన్నట్టు గుర్తించి సంబంధిత డీలర్ సిడగ రాములమ్మపై కేసు నమోదు చేశామన్నారు. డిపో నిర్వహణ బాధ్యతను సమీపంలోని రామయ్యపాలెం డీలర్‌కు అప్పగించామన్నారు.

యువకుడిపై కేసు నమోదు

సంతకవిటి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుళ్లసీతారాపురం గ్రామానికి చెందిన కంబాల శిరీషతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన బొద్దూరు రాజుపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ వి.జనార్దనరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం శిరీషతో రాజు అసభ్యంగా ప్రవర్తించి గాయపరచడంతో రాజాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతోందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మద్యంతో ఒకరి అరెస్టు

విజయనగరం క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జామి మండల కేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వాకా బంగారునాయుడును అదుపులోకి తీసుకుని 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రాజశ్రీ సోమవారం తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాలతో తనిఖీలు చేపట్టి బంగారునాయుడును అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలు నిమిత్తం ఎస్‌కోట ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. దాడుల్లో ఈసీలు జనార్దన్, నాయుడు పాల్గొన్నారు.

నిఘా పెంచిన పోలీసులు

లక్కవరపుకోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి శ్రీరాంపురం మీదుగా కల్లేపల్లి-రేగ వెళ్లే మార్గంలో పోలీసులు నిఘా పెంచారు. సోమవారం రాత్రి సిబ్బందితో కలిసి ఆ మార్గంలో బీటు తిరిగారు. కొంతకాలంగా ఈ మార్గంలో ప్రయణిస్తున్న వారిని దొంగలు అడ్డుకొని సెల్‌ఫోన్లు, బైక్‌లు లాక్కుంటున్న సంగతి తెలిసిందే. అలాగే రైతుల వాటర్ ఇంజన్లు, మోటార్లు, నాటు కోళ్లు, మేకలు పోతుండటం ఎక్కువైంది. దీంతో ఎస్ఐ నవీన్‌పడాల్ నిఘా పెంచారు.

ప్రైవేట్ యాజమాన్యాలు ఏకతాటిపై నడవాలి

విజయనగరం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఏకతాటిపై ముందుకు నడవాలని రాయసీమ జిల్లాల ఎమ్మెల్సీ, ఏపీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర ప్రతినిధి వి.రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సన్ స్కూల్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో శాసనమండలి అభ్యర్థిగా తమ సంఘం తరఫున సుంకరి శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారన్నారు. ఆయన గెలుపునకు అందరూ కృషి చేయాలని కోరారు.

రీసర్వేలో లోటుపాట్లు సరిచేయండి

రేగిడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన రీసర్వేలో ప్రభుత్వ భూములుగా డీ పట్టా భూములను నమోదు చేసి అడంగల్ రాకుండా చేశారని మునకలవలస రైతులు తహశీల్దార్ చిన్నారావుకు నివేదించారు. రీసర్వేలో లోపాలు సరిచేయాలని రెవెన్యూ సదస్సులో రైతులు మూకుమ్మడిగా కోరారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

నెల్లిమర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుకు అందిన దరఖాస్తుల మేరకు తయారు చేసిన ఓటర్ల జాబితాను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో సోమవారం తహసీల్దార్ బి.సుదర్శనరావు ఆధ్వర్యంలో ఎన్నికల విభాగం డీటీ జగన్నాథరావు వేలాడదీశారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాలరావు, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, వీఆర్ఓ రవి, మహేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

డిస్పెన్సరీ సేవలు మెరుగుపరచండి

నెల్లిమర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మికులు, వారి కుటుంబీకులకు ఈఎస్ఐ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు నాణ్యమైన మందులు సరఫరా చేయాలని నెల్లిమర్ల జూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు కోరారు. ఈమేరకు ఈఎస్ఐ డిస్పెన్సరీ వైద్యులను సోమవారం కలిసి వైద్యులకు వినతిపత్రం అందజేశారు.

అనాథ విద్యార్థుల కళ్లలో వెలుగులు

రేగిడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనాథ విద్యార్థుల్లో సంక్రాంతి వెలుగులు నింపేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఎంఈవోలు వరప్రసాదరావు, బి.ఎరకయ్య సూచించారు. స్థానిక ఎంఆర్‌సీలో సోమవారం అనాథలకు సంక్రాంతికి చేదోడుగా ఉండేందుకు స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్లు ఎంఈవోలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనాథలను గుర్తించి వారికి సంక్రాంతికి దుస్తులు పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు.

చురుగ్గా సభ్యత్వ నమోదుకు సూచన

విజయనగరం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్టానం పిలుపు మేరకు నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సూచించారు తక్కువ సభ్యత్వాలు చేపట్టిన 18 డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో ఆమె మాట్లాడారు. సమావేశంలో ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, నర్సింగరావు, పోలినాయుడు ఉన్నారు.

గ్రానైట్ కొండపై గద్దలు!

(5వ పేజీ తరువాయి)

తీవ్ర నష్టం వాటిల్లుతుందని కలవరపడుతున్నారు. అలాగే గ్రానైట్ క్వారీ ప్రారంభమైతే ప్రకృతి వనరులు ధ్వంసమై స్థానికంగా నివాస ముంటున్న గిరిజనులకు అన్నివిధాలా నష్టం వాటిల్లుతుందని భయ పడుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా ప్రైవేటు వ్యక్తులు సర్వే నిర్వహించారన్న సమాచారం మండలంలో చర్చనీయాంశంగా మారింది. దీనివెనుక ఎవరనేది నిగ్గుతేల్చి వారికి వ్యతిరేకంగా ఆందోళ న చేపట్టాలని గిరిజన, ఆదివాసీ, ప్రజాసంఘాలు, వామపక్షాలు భావిస్తున్నాయి.

అనుమతి ఇవ్వొద్దు

కొండపై గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వవద్దని గిరిజనులు కోరుతున్నారు. కొండను తవ్వితే అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ కొండలను ఆను కుని సుమారు 150 కుటుంబాలు పోడు వ్యవసాయం చేసుకుంటు న్నాయి. తవ్వకాలు మొదలైతే తమ జీవనాధారం పూర్తిగా దెబ్బతిం టుందని గిరిజనులు వాపోతున్నారు. పశువులకు మేత, తాగునీరు కరువై పోతుందని ఆవేదన చెందుతున్నారు. వణ్యప్రాణుల మనుగడ కూడా ప్రశ్నార్థం అవుతుందంటున్నారు. ఇక్కడి కొండల నుంచి జాలు వారిన నీటితో కూనేటిగెడ్డ తదిత వాగుల ఉనికి దెబ్బతినే ప్రమాదం ఉందని, ఇదే జరిగితే 500 ఎకరాల ఆయకట్టుకు నీరు అందదని, ఆ భూములు బీడువారుతాయని రైతులు కలవర పడుతున్నారు. అంతే కాకుండా ఈ కొండను ఆనుకుని ఉన్న జిరాయితీ భూములకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. గ్రానైట్ తవ్వకాలు మొదలైతే దుమ్ము, ధూళి, శబ్దకాలుష్యంతో తమ ఆరోగ్యాలు దెబ్బతింటాయని వారు ఆందోళన చెందుతున్నారు.

● గిరిజన సంఘం కార్యదర్శి టి.సోములు, సీపీఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన ప్రతినిధులు చల్ల సత్యం, సౌంట్యాన గంగరాజు తదితరుల ఆధ్వర్యంలో ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన ఆడవిపుత్రులు తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు ఇటీవల వినతిపత్రాన్ని అందజేశా రు. గ్రానైట్ తవ్వకాలు ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు ఆమోదయోగ్యం కాదని వారంతా తేల్చిచెప్పారు. తాజా పరిణామాల నేపథ్యంలో గిరిజ నులు, ప్రజా సంఘాలు కొద్దిరోజులుగా బోడిమెట్ట ప్రాంతంలో అపరి చితుల కదిలికలపై నిఘా పెట్టాయి. మొత్తమ్మీద ఎప్పుడో ముగిసిందని భావిస్తున్న గ్రానైట్ వ్యవహారం మళ్లీ ఇప్పుడు మొదటికే వస్తుండడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ విషయాన్ని తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా సర్వేపై తమకు ఎటువంటి సమాచా రం లేదని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారుల సూచన మేరకు ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.

బోగస్ పింఛన్లకు చెక్

బొబ్బిలి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మంచం పట్టిన రోగులకు సంబంధించి బోగస్ పింఛన్లకు చెక్ పెట్టేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వైద్య బృందం బొబ్బిలి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పునఃపరిశీలన చేసింది. మండలంలో ఇప్పటివరకు మంచానపడి ఉన్న దీర్ఘకాలిక రోగులు కమ్మవలస, పిరిడి, కోమటిపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో మొత్తం నలుగురు ఉన్నారని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. వీరిని పరిశీలించేందుకు జిల్లా నుంచి వైద్యులు వచ్చారని చెప్పారు. ఈ తనిఖీల్లో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

తెంటు జయప్రకాష్‌కు నివాళి



జయప్రకాష్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడు

బాడంగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): దివంగత నేత, తెర్లాం మాజీ ఎమ్మెల్యే తెంటు జయప్రకాష్ వర్ధంతిని బాడంగిలోని తెంటు బంగ్లాలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్ సతీమణి సత్యవతమ్మ, కుమారుడు బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడు పాల్గొన్నారు. జయప్రకాష్ సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనం తరం తెంటు బంగ్లా వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా లక్ష్మంనాయుడు మాట్లాడుతూ తన తండ్రి టీడీపీ తరపు న ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలపై వివక్ష చూపించవద్దు

విజయనగరం క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖైదీల పట్ల సిబ్బంది, తోటి ఖైదీలు ఎటువంటి వివక్ష చూపించరాదని న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సబ్ జైలును ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలులోని ముద్దాయిలకు సకాలంలో న్యాయ సాయం అందించడానికి జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు. వాటిని సక్రమంగా కొనసా గించాలన్నారు. ముద్దాయిలకు ఉచిత న్యాయ సాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమన్నారు. రిమాండ్‌లోని ముద్దాయిలకు న్యాయవాదిని ఉచితంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమకూ రుస్తుందన్నారు. ఈ సందర్భంగా జైలులో అమలవుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తనిఖీల్లో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు డి.సీతారామ్, సాయి పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రామభద్రపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్య ల పరిష్కారంలో గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఎటువంటి తేడా కనిపించడం లేదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 2517 స్టేట్ అకడమి క్ కన్వీనర్ జేసీ రాజు ఆరోపించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్ బకాయిలు తక్షణ మే చెల్లించి ఈ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు కూడా ప్రకటించకపోవడం అన్యా యమన్నారు. ఆంగ్లభాష బోధనకు సంబంధించి జీవో 85ను రద్దు చేసి తెలుగు, ఇంగ్లీషులో బోధనలు చేయుటకు ఉత్తర్వులు జారీ చేయాల న్నారు. పదవీ విరమణ చేసిన వారికి బకాయిలు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దానిని నిరోధించాలని కోరారు. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు పూర్తి స్థాయిలో విధులు నిర్వహించేలా మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, పార్ట్‌టైం కాకుండా ఓకేషనల్ టీచర్లుగా మార్చాని డిమాండ్ చేశారు. కేజీబీవీలో తెలుగు టీచర్‌ను తొలగించడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసిందని, మళ్లీ కేజీబీవీలో తెలుగు బోధకులను పునఃనియమించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బీబీ దర్శన్, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సురేష్ పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు తరలిరండి

నెల్లిమర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశిని పురస్కరిం చుకుని ఈ నెల 10న రామతీర్థంలో జరుగునున్న గిరి ప్రదక్షిణకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని సాధు పరిషత్ రాష్ట్ర అధ్య క్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి పిలుపునిచ్చారు. గిరి ప్రదక్షిణ జరిగే ప్రాంతంలో కొండ చుట్టూ జరుగుతున్న రోడ్డు పనులను సోమ వారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఏ లోకం నాగమాధవి రూ.2 కోట్లు నిధులు రప్పించి, పనులు వేగవంతంగా జరిగేలా చూడడాన్ని అభినందించారు. పరమ పవిత్రమైన పర్వతం చుట్టూ వైకుంఠ ఏకాదశి నాడు గిరి ప్రదక్షిణ చేయడం ముక్తి దాయకమన్నారు. ఆయనతో పాటు రామతీర్థం సేవాపరిషత్ వ్యవస్థాపకుడు జ్యోతి ప్రసాద్ ఉన్నారు.

అంధకారంలో ఆర్టీసీ కాంప్లెక్స్

● ఇన్వర్టర్ సదుపాయం లేని వైనం

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

పాలకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన పాలకొండలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అంధకారం అలముకుంది. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణమంతా చీకటిమయంగా మారుతుంది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు కోసం వేచిఉండే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం సుమారు 6.30 గంటల నుంచి రూ.7.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రయాణకులు చీకటల్లోనే మగ్గారు. బస్టాండ్‌లో చీకటిగా ఉన్న సమయంలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసున్నారు. కనీసం ఒక లైటు వెలిగేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ● ఇదే విషయం ఆర్టీసీ డీఎం వేంకటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా ఇన్వర్టర్ వంటివి అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లేదని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.



చీకటిలో పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

● మంత్రి సంధ్యారాణి

● ఘనంగా రహదారుల ప్రారంభోత్సవం

మక్కువ/సాలూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అభివృ ద్ధిని అడ్డుకుంటే సహించే ప్రసక్తే లేదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హెచ్చరించారు. మక్కువ మండలం కాశీప ట్నం గ్రామంలో సోమవారం జరిగిన వంద రహదారుల ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సెప్టెంబరు నెలలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించి కేవలం వంద రోజుల కాల వ్యవధిలోనే నియోజకవర్గంలో వంద రోడ్లు పూర్తి చేసిందని గుర్తు చేశారు. మక్కువ మండలంలో ఆరు నెలల కాలంలో రూ.14కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు.

అధికారులు భయపడొద్దు

మక్కువ గ్రామంలో 11 రోడ్లు మంజురు చేస్తే కేవలం ఒకే ఒక్క రోడ్డు పూర్తి చేశారని మంత్రి తెలిపారు. రోడ్డు నిర్మాణంలో అడ్డుపడితే సహించేది లేదని హెచ్చరించారు. ఒకటి రెండు సార్లు ఊరుకుంటానని, మూడో సారి నేరు గా ఆ గ్రామానికి వెళ్లి రోడ్డు వేస్తానని చెప్పారు. ఒక ఎమ్మెల్యేగా, మంత్రిగా తనకు ఆ అధికారం ఉందని అన్నారు. అభివృద్ధి విషయంలో అధికారులు భయపడే ప్రసక్తి వద్దని, ఎలాంటి అనుమతులు కావాలన్నా ఇస్తాన ని హామీ ఇచ్చారు. ఏ పార్టీ నాయకులు ముందుకు వచ్చినా పనులు ఇవ్వటానికి తాను సిద్ధమన్నారు.

● త్వరలో జిల్లాలో 63 అంగన్‌వాడీ పోస్టులు రానున్నాయని తెలిపారు. పాఠశాలలు ఆరంభం కాగానే తల్లికి వందనం డబ్బులు తల్లులు ఖాతాలో జమ కానున్నాయని చెప్పారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా వంద రోడ్లు నిర్మాణం పూర్తి చేసుకున్న ఏకైక నియోజక వర్గం సాలూరు అని అన్నారు. ధాన్యం అమ్మిన రైతుకు నాలుగైదు గంటల్లో వారి ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. సైకో ప్రభుత్వంలో ఆ విధానం లేదని కేవలం ఆ ముఖ్యమంత్రి ఎవ్వరితో మాట్లాడేవాడే కాదని విమర్శించారు.

గుడ్లా.. గోళీలా?

అనంతరం ఆమె కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసు కున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అత్యంత చిన్న పరిమాణంలో ఉన్న కోడి గుడ్డును చూసి ఆమె ఆశ్చ ర్యం వ్యక్తం చేశారు. గుడ్లా.. గోళీలా అన్ని ప్రశ్నించారు. ఈ విషయాన్ని చాలా సార్లు అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోలేదని సిబ్బంది, ప్రిన్సిపాల్, అంగన్‌వాడీ కార్యకర్తలు చెప్పారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకుంటా నని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు, నిమాది తిరుపతిరావు, కోట జయ, సూరపాటి చంద్రరావు, డాక్టర్ మల్లేశ్వరరావు, గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



కాశీపట్నంలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

రూ.300కోట్లతో అభివృద్ధి పనులు

సాలూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీని ఒప్పించి, కేంద్రం నుంచి రూ.300 కోట్లు తెప్పించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు మండలం తోణాంలో రూ.6లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆమె సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రూ.300కోట్లుతో అభివృద్ధి పనులు చేపడితే అందులో రూ.80కోట్లతో సాలూరు నియోజకవర్గంలో పనులు జరుగుతున్నాయన్నారు. పల్లె పండగ కార్యక్రమంలోలో పనులు ప్రారంభించి వంద రోజులు పూర్తి కాకుండానే సాలూరు నియోజకవర్గంలో రూ.5కోట్లుతో 102 రోడ్లు పూర్తి చేసి ప్రారంభించుకుంటు న్నామని ఆమె తెలిపారు. తోణాం గ్రామంలో మంత్రికి ఘన స్వాగతం లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు గజమాల వేసి, స్వాగతం పలికారు. కోలాటం ఆడుతున్న మహిళలతో కలిసి ఆమె కోలాటం ఆడారు. టీడీపీ సాలూరు మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, నిమ్మాది చిట్టి, మత్స శ్యాం, బూస తవుడు, రంభ రజని, వెంకటేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 121 అర్జీలు



పార్వతీపురం: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పార్వతీపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యా లయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 121 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ తో పాటు జేసీ ఎస్ఎస్ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్‌వో కె.హేమలత, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి భాగస్వాములై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశిం చారు. గుమ్మలక్ష్మీపురం మండలం జోగిపురం, డొంగరికి క్కువ, కురపాం మండలం బొడ్డిగాడిగూడ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్థులు అర్జీలను అందజేశారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని ఆ గ్రామ ప్రజలు వినతిపత్రం అందించారు. ఇలా మరిన్ని అర్జీలను అందించారు. పలు అర్జీలకు సంబంధించి కలెక్టర్ స్వయంగా వివరాలు నమోదు చేసుకున్నారు.

గిరిజన సమస్యలు పరిష్కరించండి

సీతంపేట రూరల్, జనవరి 6(ఆంధ్ర జ్యోతి): గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరి ష్కరించాలని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబును కోరారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఏపీవో జి.చిన్నబాబు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నూతన గృహం మంజూరు చేయాలని కె.బొంబడుగూడ గ్రామాని కి చెందిన సవర రాజయ్య కోరారు. ఎగువదారబ గ్రామం లో జీపీఎస్ పాఠశాల భవనం, తాగునీటి సౌకర్యం కల్పిం చాలని సవర భుజంగరావు కోరారు. ఉద్యోగవకాశం కల్పిం చాలని లబ్బ గ్రామానికి చెందిన జన్ని నాగేశ్వరరావు కోరా రు. ఇలా అనేక సమస్యలు పరిష్కారం కోరుతూ పీజీఆర్ ఎస్‌కు 22 వినతులు వచ్చాయి. గ్రీవెన్స్‌లో ఏపీవోతో పాటు డీడీ అన్నదొర, పీహెచ్‌వో వెంకటగణేష్, ఏఎంవో కోటిబా బు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వెంకన్న ద్వార దర్శనానికి కలెక్టర్‌కు ఆహ్వానం

పార్వతీపురం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యో తి): స్థానిక శ్రీవిద్య సర్వమంగళదేవి పీఠం(దుర్గ గుడి) ప్రాంగణంలో కొలువై ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శన ఉత్సవానికి విచ్చేయాలని ఆ పీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ మురపాక కాళిదాసువర్మ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ను ఆహ్వానించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాల యంలో కలెక్టర్‌ను కలిసి, ఆహ్వానించినట్టు చెప్పారు. ఈనెల 10న వైకుంఠ ఏకాదశి మహాపర్వదినం సందర్భం గా వైభవ వేంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శన ఉత్స వం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి కలెక్టర్ దంప తులు పాల్గోవాలని ఆహ్వానం పలికామని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

విజయనగరం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాల ని డీఎంహెచ్‌వో జీవనరాణి అన్నారు. జిల్లా వైద్యాధికారి గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా సోమ వారం విజయనగరం నియోజకవర్గ పరిధిలోని రాకోడు పీహెచ్‌సీ ఆమె సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశా రు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాదులపై వైద్య సిబ్బందిని అలర్ట్‌గా ఉండాలన్నారు. వైద్యురాలు శ్రావణి, మాణిక్యం, శ్రీరామ్మూర్తి, శ్రీను, కళావతి, ప్రసాద్, అప్పల నాయుడు, రాకోడు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాపాలతో రాష్ట్రాభివృద్ధికి ఆటంకం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కళా వెంకటరావు



మాట్లాడుతున్న కళా వెంకటరావు

బొబ్బిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన పాపాలు శాపాలుగా మారి రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయని, అభివృద్ధి సాధనకు ఆటంకాలుగా మారాయని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు దుయ్యబట్టారు. సోమవారం స్థానిక కోటలో ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి జగన్‌తీరుపై విరుచుకుపడ్డారు. రూ.40 వేల కోట్ల కుంభకోణంలో అరెస్టు అయిన జగన్ 12 ఏళ్లుగా సీబీఐ కేసు నుంచి ఎలా తప్పించుకుని తిరగగలుగుతున్నారన్నారు. ఆయనకేమైనా ప్రత్యేక రాజ్యాంగం ఉందా.. అని ప్రశ్నించారు. మళ్లీ జగన్ అధికారంలోనికి రాడనే గ్యారెంటీ ఇస్తేనే పరిశ్రమలు పెడతామని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారంటే పరిస్థితిని ఎంతలా దిగజార్చారో అర్థం చేసుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖను ఆర్థిక రాజధానిగా చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్‌టీపీసీ ప్రాజెక్టు, టీసీఎస్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, రైల్వేజోన్‌కు 52 ఎకరాల కేటాయింపు, అనకాపల్లి, నక్కపల్లిలో పరిశ్రమల ఏర్పాటు వంటివి జోరుగా సాగుతున్నాయని తెలిపారు. మెట్రోరైలు ప్రాజెక్టుకు కూడా ప్రతిపాదనలు ఉన్నాయన్నారు.

బహిరంగ సభకు తరలిరండి

ఈనెల 8న ప్రధాని నరేంద్రమోదీ విశాఖలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారని, ఈసందర్భంగా లక్ష మందితో రోడ్ షో, 3 లక్షలమందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, లక్షలాదిగా తరలిరావాలని ఆయన కోరారు. చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఉత్తరాంధ్రలోని 5 జిల్లాల్లో గల 34 నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున జన సమీకరణ చేపడుతున్నామని చెప్పారు. బొబ్బిలి, చీపురుపల్లి నియోజకవర్గాల నుంచి 65 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి విచ్చేసిన చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంటరావుతో ఎమ్మెల్యే బేబీనాయన, ఎఫ్‌డీసీ చైర్మన్ సుజయ్‌కృష్ణ




స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి సంధ్యారాణి



కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పూలంగి సేవకు ప్రముఖులు

బొబ్బిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన పూలంగి సేవలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట రావు, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, బుడా చైర్మన్ తెంటు లక్ష్మనాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రి సంధ్యారాణికి అర్చకులు స్వాగతం పలికి, ఆశీర్వచనాలు అందించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఉన్నారు. అలాగే కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి దంపతులను ఎఫ్‌డీసీ చైర్మన్, ఆలయ అనువంశిక ధర్మకర్తలు ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు, ఎమ్మెల్యే బేబీనాయనలు సత్కరించారు.



ఎంపీ కలిశెట్టికి స్వామివారి చిత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



ఎమ్మెల్సీ రఘురాజు దంపతులకు..

న్యూస్ బాక్స్

పీసా ఎన్నికలు 275 గ్రామాల్లో ఏకగ్రీవం

పార్వతీపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో జరిగిన పీసా ఎన్నికలు 278 గ్రామాలకుగాను 275 గ్రామాల్లో ఏకగ్రీవం అయ్యాయని పీవో అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకు ఐటీడీఏ పరిధిలోని 8 పీసా మండలాల్లోగల 278 గ్రామాల్లో ఎన్నికలు జరగగా 275 గ్రామాల ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. రెండు గ్రామాల్లో ఎన్నికలు జరిగినట్టు పీవో వివరించారు.

పూడ్చిన గుంతలపై తారు

భామిని, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బత్తిలి, కొరమ గ్రామాల రోడ్లపై అడుగడుగు న గుంతలు ఉండడంతో గత నెల 13వ తేదీన మట్టి వేసి చదును చేశారు. అయితే పూడ్చిన గుంతలపైనే సోమవారం తారు వేయడం ప్రారంభించారు. బిల్లుమడ గ్రా మం నుంచి పసుకుడి గ్రామం వరకు మూ డు కిలోమీటర్ల మేర గుంతలు ఉన్నా పట్టించుకోవడం లేదంటూ ఆ ప్రాంత ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఉపాధి హామీ సామాజిక ప్రజావేదిక

భామిని, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీ య గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ సామాజిక తనిఖీపై మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపా రు. గత ఏడాది 2023-24 నిధుల వినియో గంపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు చెప్పా రు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

రీ సర్వేకు సహకరించాలి

వీరఘట్టం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేకు సంబంధించి తూడి గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వ హించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ మాట్లాడారు. గ్రా మంలో భూముల రీసర్వే నిర్వహిస్తున్నామ ని, సమస్యలున్న రైతులు పాల్గొని అధికా రులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ సత్య నారాయణ, రీసర్వే డీటీ ప్రసాదరావు, వీఆ ర్వో విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు టచ్‌ఫోన్ల పంపిణీ

పార్వతీపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ బధిరు లకు టచ్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న టచ్‌ఫోన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు తోటపల్లి హుండీల లెక్కింపు

గరుగుబిల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల హుండీల లెక్కింపు ఈనెల 8న నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు నిబంధనల మేరకు లెక్కింపులో పాల్గనవచ్చన్నారు.

బెల్లపుఊట ధ్వంసం

పార్వతీపురంటౌన్, జనవరి 6(ఆంధ్రజ్యో తి): ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో గల గ్రామాల్లో 8,400 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ సురేష్ సోమ వారం తెలిపారు. ఆంధ్రా, ఒడిసా సరిహద్దు గ్రామాలైన కప్పలాడ, అలమండ, కర్లి గ్రామాల పరిధిలో ఇరు రాష్ట్రాల ఎక్సైజ్ పోలీసులు 75 మంది దాడులు జరిపి 8,400 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేయడంతో పాటు 80 లీటర్ల సారాను స్వాధీనం చేసుకు న్నారని చెప్పారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో సతమతమయ్యే పేదలకు ప్రభుత్వం అండ గా నిలుస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. పట్టణానికి చెందిన గేదెల మంగ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.51,310 చెక్కును ఆయన సోమవారం అందించారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు జి.రవి, కోలా మధు, గేదెల రామారావు పాల్గొన్నారు.